పల్స్‌పోలియోకు ఏర్పాట్లు పూర్తి

బాలానగర్/ కుత్బుల్లాపూర్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): బాలానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కూకట్‌పల్లి, బాలానగర్ మండల పరిధిలో పల్స్ పోలియో (చుక్కల మందుకు) ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ వి.మమత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చుక్కల మందు వేసేందుకు 116 బూత్, 2 ట్రాన్సిస్ట్ కేంద్రాలు, 2 మొబైల్ వాహనాలు ఏర్పాటు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. 48,034 మంది చిన్నారులకు చుక్కల మందు వేసేందుకు టార్గెట్ పెట్టుకున్నామని, ఇందుకోసం 160 మంది ఆశాలు, ఆరుగురు సూపర్‌వైజర్లు 32 మంది ఏఎన్ఎంలు, ముగ్గురు హెల్త్ అసిస్టెంట్లు విధులు నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. సోమ, మంగళ బుధవారం (మూడు రోజులు) ఇంటింటి సర్వే ఉంటుందని ఆమె వెల్లడించారు.

● మియాపూర్: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో నిర్వహించే పల్స్‌పోలియో కార్యక్రమంలో భాగంగా 0-5 సంవత్సరాల లోపు పిల్లలకు తప్పని సరిగా పోలియో చుక్కలు వేయించాలని ఎమ్మెల్యే గాంధీ తెలిపారు. రెండు పోలియో చుక్కలు చిన్నారుల ఆరోగ్యకరమైన భవిష్యత్‌కు భరోసా అన్నారు. పాఠశాలలకు, బస్టాప్‌లు, రైల్వేస్టేషన్లు, మొబైల్‌టీమ్స్ ద్వారా పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, పోలియోరహిత సమాజం కోసం అందరూ కృషి చేయాలని కోరారు.


నమూనాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ప్రతిభను వెలికితీసే వైజ్ఞానిక ప్రదర్శనలు

హైదర్‌నగర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ జయనగర్‌కాలనీలోని గౌతమి మోడల్ పాఠశాలలో శనివారం నిర్వహించిన విజ్ఞాన ప్రదర్శనను ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన నమూనాలను వారు తిలకించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భారతీయ శాస్త్ర విజ్ఞానాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన గొప్ప శాస్త్రవేత్త, నోబెల్ గ్రహీత సీవీ రామన్ రామన్ ఎఫెక్ట్ కనుగొన్న సందర్భాన్ని పురస్కరించుకుని ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. విద్యార్థులు తయారు చేసిన నమూనాలు ఆలోచింప చేసేవిధంగా ఉన్నాయన్నారు. విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలన్నారు.

డ్రైనేజీపైప్‌లైన్ పనులు ప్రారంభం


డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ సతీష్‌గౌడ్‌తో అనిల్‌కుమార్

ఫతేనగర్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఫతేనగర్ డివిజన్‌లో డ్రైనేజీ సమస్యలు లేకుండా చర్యలు చేపడుతున్నామని కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ అన్నారు. శనివారం ఉదయం డివిజన్ పరిధి ఇందిరాగాంధీపురంలో రూ.10 లక్షల నిధులతో చేపడుతున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను జలమండలి మేనేజర్ అనిల్‌కుమార్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఇమ్రాన్, షౌకత్, సలీం, అన్వర్ సంతోష్ పాల్గొన్నారు.


డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి

● బాలానగర్: బాలానగర్ డివిజన్ పరిధి ఫిరోజ్‌గూడలో డ్రైనేజీ పైప్‌లైన్ పనులను కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ అనిల్‌కుమార్, సూపర్‌వైజర్ సాయి, బీఆర్ఎస్ నాయకులు మందడి సుధాకర్‌రెడ్డి, ఫిరోజ్‌గూడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సురేశ్, నాయకులు శంకర్‌గౌడ్, అజీముద్దీన్, బాలేశ్ పాల్గొన్నారు.

ఇందిరానగర్‌లో ఊపందుకున్న బస్తీ ఎన్నికల ప్రచారం

బాలానగర్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): బాలానగర్ డివిజన్ ఇందిరానగర్ బస్తీ సంక్షేమ సంఘం ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. బస్తీలో రాత్రికి రాత్రే ఫ్లెక్సీలు వెలిశాయి. అధ్యక్ష, జనరల్ సెక్రటరీ, కోశాధికారి పదవుల కోసం బరిలో నిలిచిన అభ్యర్థులు తమను గెలిపించాలని ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా బస్తీ ఎన్నికల కమిటీ చైర్మన్ నర్సింహ్మారెడ్డి మాట్లాడుతూ.. ఈనెల 6న ఉదయం 7 గంటలనుంచి ఒంటి గంట వరకు కమ్యూనిటీ హాలులో పోలింగ్ ఉంటుందని, భోజన విరామం తరువాత కౌంటింగ్ ఫలితాలు ప్రకటిస్తామని ఆయన స్పష్టం చేశారు.

వీజేఐఎంలో మాన్యువల్ ఫెస్ట్ మిలాన్


బహుమతి అందుకున్న విద్యార్థులు

నిజాంపేట్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): బాచుపల్లిలోని వీజేఐఎంలో మాన్యువల్ ఫెస్ట్ మిలాన్-2024తో ప్రారంభమైంది. ప్రతీ సంవత్సరం మూడు రోజుల పాటు మిలాన్-24 పేరుతో క్రీడలు, బిజినెస్, ప్లాన్స్ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. బిజినెస్, ప్లాన్స్ విభాగంలో నిర్వహించిన పోటీల్లో 13 టీమ్‌లు పాల్గొన్నాయి. ఈపోటీల్లో భవన్స్ వివేకానంద కాలేజ్‌కు చెందిన విద్యార్థులు ప్రసాద్, విలాస్, యాష్‌గోహారా ప్రతీక్, సుమిత్‌శర్మ టీమ్ విజేతలుగా నిలిచి రూ.20 వేల ప్రైజ్‌మనీ అందుకున్నారు. 2వ స్థానంలో శివశివాణి మేనేజ్‌మెంట్ కాలేజీకి చెందిన హర్షిత్, పర్కార్‌సింగ్, రూ.10 వేలు అందుకున్నారు. కార్యక్రమానికి కో-ఆర్డినేటర్‌గా అధ్యాపకులు శ్రీనివాస్, హరిప్రియ పాల్గొన్నారు.


శ్రీపాదరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కమాండెంట్ సన్ని తదితరులు

శ్రీపాదరావుకు నివాళి

గచ్చిబౌలి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): కొండాపూర్‌లోని 8వ పోలీస్ బెటాలియన్‌లో శ్రీపాదరావు జయంతిని కమాండెంట్ సన్ని ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ సుబ్రహ్మణ్యం, సహాయ కమాండెంట్స్ సీతారాం, రాంబాబు, నాగభూషణం, పార్థసారధి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్స్ పాల్గొన్నారు.


వరదనీటి కాల్వ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు

వరదనీటి కాల్వ పనుల పరిశీలన

హైదర్‌నగర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్ డివిజన్ జానకిరామ టవర్స్ వద్ద చేపడుతున్న స్ట్రాం వాటర్ డ్రైన్(వరదనీటి కాలువ) నిర్మాణ పనులను జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులు, కాలనీవాసులతో కలిసి శనివారం కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తామని తెలిపారు. వర్క్‌ఇన్‌స్పెక్టర్ మహదేవ్, పోతుల రాజేందర్, హరి, సురేష్, చంద్రశేఖర్, కోటేశ్వరరావు, వెంకటకృష్ణ, భూషణ్, ప్రసాద్, రామకృష్ణ రాజు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

గచ్చిబౌలి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి నల్లగండ్ల సోమేశ్వరస్వామి దేవస్థానం నూతన కమిటీ సభ్యులకు శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ నియామకపత్రం శనివారం అందజేశారు.

కబ్జాదారుల చెరలో ఈద్గవానికుంట

రాయదుర్గం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): గోపన్‌పల్లి రెవెన్యూ గ్రామ పరిధిలోని ఈద్గవానికుంటలో కబ్జాదారులు ఆక్రమించి మట్టితో చెరువును పూడ్చివేశారు. ఈ విషయం తెలుసుకున్న ఇరిగేషన్ అధికారులు భూకబ్జాదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. అయితే ఈ కేసు కోర్టులో ఉండటంతో గత ఆరు నెలలుగా చెరువుకు ఎలాంటి విముక్తి లభించలేదు. చెరువు పరిరక్షణ పనులు చేసుకోవచ్చని ఇరిగేషన్ అధికారులకు కోర్టు ఆదేశించింది. దీంతో గౌలిదొడ్డికి అనుకుని ఉన్న 70, 36 సర్వేనెంబర్లలోని 5 ఎకరాల 30 గుంటల్లో విస్తరించి ఉంది. ఈ స్థలంలో 2.20 ఎకరాల ప్రైవేటు స్థలంలోకి వెళ్లకుండా ప్రస్తుతం మిగత భూమిలో పనులు నిర్వహిస్తున్నారు. కాగా గతంలో ఈద్గవానికుంటలో సుమారు 80 శాతం మట్టితో భూ కబ్జాదారులు పూడ్చివేసిన స్థలంలో ఇరిగేషన్ అధికారులు తిరిగి మట్టిని తొలగించే పనులు ప్రారంభించారు. గతంలో భూ కబ్జాదారులు చెరువులో మట్టినింపడంతో పాటు చెరువు కట్టను సైతం ధ్వంసం చేశారు. అయితే తాజాగా చెరువులో పోసిన మట్టిని తొలగించి చెరువుకు పూర్వస్థితి కల్పించేందుకు పనులు ప్రారంభించినట్లు ఇరిగేషన్ ఏఈ జ్యోతిర్మయి శనివారం తెలిపారు. గచ్చిబౌలి పోలీసుల బందోబస్తు మధ్య చెరువు పునరుద్ధరణ పనులు ప్రారంభించినట్లు ఆమె పేర్కొన్నారు. మట్టితొలగించే పనులను సైతం అడ్డగించేందుకు భూ కబ్జాదారులు ఇరిగేషన్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. అయినపట్టికి పనులను కొనసాగించి చెరువును యథాస్థితికి తీసుకువస్తామని ఏఈ తెలిపారు. ఈ పనులను ఇరిగేషన్ విభాగం ఎస్ఈ ఆనంద్, ఈఈ శంకర్‌రావు తదితరులు పరిశీలించారు.



ఏఈ జ్యోతిర్మయితో వాగ్వాదం చేస్తున్న కబ్జాదారులు, చెరువులో పోసిన మట్టిని తొలగిస్తున్న దృశ్యం

సింథటిక్ ఎఫెక్ట్

- 14 మంది బోగస్ కార్మికుల తొలగింపు
- ఇద్దరు ఎస్ఎఫ్ఏలపైనా వేటు

హైదరాబాద్ సిటీ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికుల బోగస్ హాజరుపై కమిషనర్ సీరియస్ అయ్యారు. పోలీసులకు పట్టుబడిన ఇద్దరు శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్లు(ఎస్ఎఫ్ఏ), 14 మంది బోగస్ పారిశుధ్య కార్మికులను తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సింథటిక్ వేలిముద్రలు వినియోగిస్తూ అంబర్‌పేట సర్కిల్‌కు చెందిన ఎస్ఎఫ్ఏలు పోలీసులకు పట్టుబడిన నేపథ్యంలో శనివారం సహాయ వైద్యాధికారులతో అత్యవసర సమీక్ష నిర్వహించారు. అంబర్‌పేట సర్కిల్‌లో గుర్తించిన 11 మంది, శేరిలింగంపల్లిలో ముగ్గురు బోగస్ కార్మికులకు సింథటిక్ వేలిముద్రలతో హాజరు వేస్తున్నట్టు గుర్తించారు. ఈ నేపథ్యంలో వారిని తొలగించారు. త్వరలో మరికొందరు ఎస్ఎఫ్ఏలు, శానిటరీ సూపర్వైజర్లపై వేటు పడే అవకాశం ఉందని ఓ అధికారి తెలిపారు. అంబర్‌పేటలో ఎస్ఎఫ్ఏలు పట్టుబడడంతో అక్కడి అధికారులను మందలించారని సమాచారం. ఏఎంఒహెచ్‌లు కొందరికి త్వరలో మెమోలూ ఇచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. కొత్త యంత్రాలు అందుబాటులోకి తీసుకొచ్చినా.. పాత మిషన్లు ఎలా వినియోగిస్తున్నారు? వారికి సహకరిస్తున్నదెవరు? కేంద్ర కార్యాలయంలోని ఐటీ ఉద్యోగుల పాత్రపైనా కమిషనర్ ఆరా తీస్తున్నట్టు తెలిసింది.

సిటీ పోలీస్ కో ఆపరేటివ్ కమిటీ ఎన్నిక

హైదరాబాద్ సిటీ, మార్చి 2(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సిటీ పోలీస్ కోఆపరేటివ్ సొసైటీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. శనివారం సెంట్రల్ జోన్ డీసీపీ కార్యాలయంలో డిప్యూటీ రిజిస్ట్రార్ శ్రీరామ్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. వైస్ ప్రెసిడెంట్‌గా మహ్మద్ ఆసిఫ్‌ఖాన్, సెక్రటరీగా నల్లా శంకర్ రెడ్డి, జాయింట్ సెక్రటరీగా సి.నవీన్‌కుమార్, ట్రెజరర్‌గా జీఎస్ఎం విక్టర్‌ను ఎన్నుకున్నారు. సొసైటీ డైరెక్టర్‌లుగా కొనిదెల రత్నకుమారి, యాంతని సుసాయి దయామని శాంతి, కేశవ్ మామిడి, దండు లక్ష్మణ్‌కుమార్, పి.వినీత్, బి.అప్పలసూరి ఎన్నుకోబడ్డారు. ఈ కమిటీ 2029 ఫిబ్రవరి 28 వరకు అధికారంలో ఉంటుందని సెక్రటరీ శంకర్‌రెడ్డి తెలిపారు.

నిజాంపేట్ కార్పొరేషన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

నిజాంపేట్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ కార్పొరేషన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. శనివారం కార్పొరేషన్ పరిధిలోని 2వ డివిజన్‌లో దాదాపు రూ.2 కోట్ల నిధులతో చేపట్టిన సీసీరోడ్డు, మంజీర పైప్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో ప్రజలకు కావాల్సిన సదుపాయాల కల్పనకు నిధులు కేటాయిస్తూ, కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తామన్నారు. అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా రూ.99 లక్షలతో చేపట్టిన పనులను ఆయన ప్రారంభించారు. ఈ అభివృద్ధి కార్యక్రమంలో మేయర్ కొలన్ నీలారెడ్డి, డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్, కమిషనర్ రామకృష్ణారావు, దుండిగల్ మున్సిపల్ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ, బీఆర్ఎస్ నాయకులు బెంబడి బుచ్చిరెడ్డి, కొలన్ గోపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, పాల్గొన్నారు.


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

ఆలయంలో అన్నదానం

నిజాంపేట్ : నిజాంపేట్ కార్పొరేషన్ 30వ డివిజన్ పరిధిలోని కార్పొరేటర్ కొలన్ మీన సునీల్‌రెడ్డి, గోకరాజు రంగరాజు కాలేజీ రోడ్డులో పాత పెద్దమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్ప్రింగ్ విల్లా కాలనీ వేంకటేశ్వర దేవాలయ మొదటి వార్షికోత్సవంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పాల్గొని అన్నదానం చేశారు. కార్యక్రమంలో మేయర్ కొలన్ నీలారెడ్డి, కాల నీవాసులు, కార్పొరేటర్లు తదితరులు ఉన్నారు.

మాస్టర్లకు ప్రోత్సాహం అందజేసిన హోప్ ఫౌండేషన్


పతకాలు సాధించిన క్రీడాకారులతో విజయ్

చందానగర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): జాతీయ, రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన రంగారెడ్డి జిల్లా మాస్టర్లకు హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం చందానగర్ పీజేఆర్ స్టేడియంలో నగదు ప్రోత్సాహం అంద జేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హోప్ ఫౌండేషన్ చైర్మన్, రంగారెడ్డిజిల్లా మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండా విజయ్ హాజరై నగదు ప్రోత్సాహాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులను ప్రోత్సహించడంలో హోప్ ఫౌండేషన్ ముందుంటుందన్నారు. పతకాలు సాధించిన 60 మంది క్రీడాకారులకు నగదు ప్రోత్సాహం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ నూనె సురేందర్, కోశాధికారి స్వాతిగౌడ్, కోచ్‌లు చిరంజీవులు, డగ్లర్, జ్యోతి ఉన్నారు.

బ్యాటరీల దొంగల అరెస్ట్


అరెస్టు చేసిన నిందితులతో పోలీసులు

నిజాంపేట్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటుపడి జనరేటర్ బ్యాటరీలను దొంగిలిస్తున్న ముఠాను బాచుపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. ముఠాలో మొత్తం 8 మంది ఉన్నారు. వీరిలో ఐదుగురిని అరెస్ట్ చేశారు. మరో ముగ్గురు యువకులు పరారీలో ఉన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ మాతృశ్రీనగర్ ప్రాంతంలో నివాసముంటున్న మేడిశెట్టి నాగేశ్వరరావు(20), బి.దుర్గాప్రసాద్(20), జి.కురుమూర్తి (21), పి.నాగశ్రీను(20), వాసంశెట్టి వెంకటేశ్వరరావులు బ్యాటరీలు చోరీ చేస్తున్నారు. బాచుపల్లి పోలీసులకు అందిన సమాచారంతో నిఘా ఏర్పాటు చేసి ఐదుగురు యువకులను అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనం చేసినట్టు అంగీకరించారు. వీరి నుంచి 33 బ్యాటరీలు, ఒక కారు, మొత్తం 2.64 లక్షల సొత్తు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.


భక్తులకు అనుగ్రహ భాషణం చేస్తున్న స్వామీజీ

వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వాత్మానందేంద్ర సరస్వతి పూజలు

చందానగర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): చందానగర్ వెంకటేశ్వరస్వామి దేవాలయానికి ఓ ప్రత్యేకత ఉందని, ఇక్కడ జరిగే దూపదీప నైవేద్యాలు ఆగమ శాస్త్రయుక్తంగా జరుగుతున్నామని విశాఖశారద పీఠ ఉత్తర పీఠాధిపతి స్వాత్మానందేంద్ర సరస్వతి అన్నారు. విశాఖశారదాపీఠ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని భవానిశంకర ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అర్చబృందం ఉన్నారు.

● చందానగర్ అన్నపూర్ణ ఎన్‌క్లేవ్ షిరిడీ సాయి బాబా ఆలయ ప్రాంగణంలోని సుబ్రహ్మణేశ్వర స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయిప్రసన్న దంపతులు సుబ్రహ్మణ్యస్వామికి వెండి కిరీటం బహూకరించారు. మురళీధర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.


వెండి కిరీటం సమర్పిస్తున్న సాయిప్రసన్న దంపతులు

బాక్సింగ్ కోచ్ చిరంజీవి ఆటోబయోగ్రఫీ ఆవిష్కరణ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): జాతీయ బాక్సింగ్ మాజీ చీఫ్ కోచ్ ఈ.చిరంజీవి జీవిత చరిత్రను పుస్తక రూపంలోకి తీసుకొచ్చారు. శనివారం కింగ్ కోఠిలోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో వివేక్ తేజ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 20-20 స్క్వేర్ ఫీట్ పేరిట ప్రముఖ రచయిత వి.శ్రీనివాస భాను రచించిన ఈ పుస్తకాన్ని రిటైర్డ్ ఐఏఎస్ ఎన్.ముక్తేశ్వర్ ఆవిష్కరించారు. అనంతరం తొలి ప్రతిని చిరంజీవికి అందించారు. మాజీ బాక్సర్‌గా, అంతర్జాతీయ కోచ్‌గా చిరంజీవి సాధించిన ఘనతలను ఈ సందర్భంగా వక్తలు స్మరించుకున్నారు. ప్రస్తుత వరల్డ్ చాంపియన్, కామెన్వెల్త్ మెడలిస్ట్ నిఖత్ జరీన్ సహా పలవురు అంతర్జాతీయ బాక్సర్లు చిరంజీవి శిష్యులు కావడం విశేషం.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ముక్తేశ్వర్

మల్లారెడ్డి గార్డెన్స్‌కు కూల్చివేత నోటీసు

జారీ చేసిన కంటోన్మెంట్ బోర్డు

సికింద్రాబాద్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి కుటుంబీకుల ఆధీనంలో ఉన్న మల్లారెడ్డి గార్డెన్స్ ఆవరణలోని కట్టడాల కూల్చివేతకు సంబంధించి సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు అధికారులు నోటీసులు జారీ చేశారు. బోయినపల్లిలో 7.80 ఎకరాల ఓల్డ్ గ్రాంట్ బంగ్లా చాలా కాలం క్రితం నుంచి మల్లారెడ్డి కుటుంబీకుల ఆధీనంలో ఉంది. మల్లారెడ్డి గార్డెన్స్ పేరిట ఫంక్షన్ హాలు, చందన గార్డెన్స్ పేరిట ఫంక్షన్ హాల్, సీఎంఆర్ హైస్కూల్, సీఎంఆర్ ఇంటర్నేషనల్ స్కూల్స్ పేరిట విద్యాసంస్థలు కొనసాగుతున్నాయి. అయితే, ఈ ప్రాంగణంలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ కట్టడాలు నిర్మించారని, వీటిని కూల్చివేస్తామంటూ అప్పట్లో కంటోన్మెంట్ బోర్డు అధికారులు నోటీసులు జారీ చేశారు. దీనిపై మల్లారెడ్డి కుటుంబీకులు న్యాయస్థానాన్ని ఆశ్రయించి స్టే తీసుకున్నారు. ఇటీవల న్యాయస్థానం స్టేను డిస్మిస్ చేసింది. దాంతో నాలుగు రోజుల క్రితం సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు అధికారులు మల్లారెడ్డి కుటుంబీకీలకు కంటోన్మెంట్ చట్టం 320 సెక్షన్ కింద నోటీసు జారీ చేశారు. దీని ప్రకారం నోటీసు జారీ చేసిన 8 రోజుల అనంతరం నిర్మాణాలను కంటోన్మెంట్ బోర్డు నేలమట్టం చేయవచ్చు. ఇదిలా ఉండగా మల్లారెడ్డి కుటుంబీకులకు నోటీసు జారీ చేసిన విషయం వాస్తవమేనని, ఈపాటికే నాలుగు రోజులు గడిచినందున బుధవారం అనంతరం తగిన చర్యలు ఉంటాయని కంటోన్మెంట్ ముఖ్యకార్యనిర్వహణాధికారి డి.మదుకర్ నాయక్ 'ఆంధ్రజ్యోతి'కి వెల్లడించారు.

ఐడీఎల్ చెరువు సుందరీకరణ త్వరగా పూర్తి చేయాలి


ఐడీఎల్ చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి బాలాజీనగర్ డివిజన్‌లోని రంగధాముని చెరువు (ఐడీఎల్ చెరువు) సుందరీకరణ పనులు త్వరగా పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కోరారు. చెరువు సుందరీకరణ పనులను శనివారం అధికారులతో కలిసి పరిశీలించారు. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, పార్కు పనులను చేపట్టేందుకు రూ.19 కోట్ల నిధులు విడుదల చేశామని తెలిపారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. హెచ్ఎండీఏ, రెన్యూ, జీహెచ్ఎంసీ, నీటిపారుదల, టౌన్‌ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

క్షత్రియ యూత్ ఫెడరేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో టెన్త్ విద్యార్థులకు కంపాస్ బాక్స్, పరీక్ష ప్యాడ్స్‌తో కూడిన కిట్స్‌ను ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు పంపిణీ చేశారు.

మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ

అల్లాపూర్ : మహిళా సాధికారత దిశగా కృషి చేస్తున్న సేవా భారతి పబ్లిక్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం మోతీనగర్‌లో మహిళలకు సబ్సిడీపై కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు హాజరైన కుట్టుమిషన్లు అందజేశారు.


మాట్లాడుతున్న రాంచందర్

బకాయిలు చెల్లిస్తేనే ఔషధాల సప్లై

ట్విన్ సిటీస్ హాస్పిటల్స్ సప్లయర్స్ అసోసియేషన్

పంజాగుట్ట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుంచి తమకు రావాల్సిన బకాయిలు చెల్లించకపోతే ప్రభుత్వ ఆస్పత్రులతో పాటు ఈఎస్ఐసీలకు సైతం అత్యవసర ఔషధాలు, చికిత్సలకు వినియోగించే వైద్యపరికరాలను సరఫరా చేయలేమని ట్విన్ సిటీస్ హస్పిటల్స్ సప్లయర్స్ అసోసియేషన్ స్పష్టం చేసింది. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు రాంచందర్, సభ్యులు మాట్లాడారు. ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్ ద్వారా టెండర్లు పొంది గాంధీ, ఉస్మానియా, నిమ్స్, నిలోఫర్‌లతోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఆస్పత్రులు, ఈఎస్ఐసీలకు ఔషధాలు, రోగులకు అవసరమైన వైద్య పరికరాలను సరఫరా చేస్తున్నామని, గతేడాది ఆగస్టు నుంచి తమకు రావాల్సిన బకాయిలు రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వక్తలు తెలిపారు. సంబంధిత అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినా ప్రయోజనంలేదని వాపోయారు. రోగులకు ఇబ్బంది పెట్టే ఉద్దేశం తమకు లేదని, ఆర్థిక వనరుల లేమితో సరఫరా చేయలేని దుస్థితి నెలకొందన్నారు. సమస్య జటిలం కాక ముందే ప్రభుత్వం స్పందించి నిధులు విడుదల చేయాలని కోరారు. టీఎస్ఎంఐడీసీ నుంచి రూ.300 కోట్లు, ఈఎస్ఐసీ నుంచి రూ.100 కోట్లు, నిమ్స్ నుంచి సుమారు రూ.50 కోట్లు, ఉస్మానియా, గాంధీ ఆస్పత్రుల జనరల్ బడ్జెట్ నుంచి బకాయిలు రావాల్సి ఉందన్నారు. ఈ నెల 31వ తేదీ లోపు బకాయిలు చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.


జ్వరం వచ్చిన చిన్నారి నాలుకపై ఏర్పడినపూత

చిన్నారుల్లో ఆందోళన కలిగిస్తున్న స్కార్లెట్ జ్వరం

షాపూర్‌నగర్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): చిన్నారుల్లో స్కార్లెట్ జ్వరం ఆందోళన కలిగిస్తోందని షాపూర్‌నగర్ పీహెచ్‌సీ ఇన్‌చార్జ్ డాక్టర్ నవనీత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసుపత్రికి వచ్చే చిన్నారుల్లో ప్రతీ 20 మందిలో 10, 12 మంది స్కార్లెట్ జ్వరంతో బాధపడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా సంవత్సరం నుంచి 15 సంవత్సరాల వయస్సు ఉన్న బాల, బాలికలకు ఈ జ్వరం వ్యాపిస్తోందని తెలిపారు. ఈ జ్వరం ఉన్న వారు పాఠశాలలో తుమ్మినా, దగ్గినా ప్రక్క వారికి వ్యాపిస్తుందని తెలిపారు. 102 డిగ్రీలతో జ్వరం రావడం, అకస్మాత్‌గా గొంతు నొప్పి, తలనొప్పి, వికారం, వాంతులు రావడం జరుగుతుంది. ఇదే కాక కడుపు నొప్పి, శరీరంపై దద్దుర్లు, నాలుక ఎర్రగా మారడం, గొంతు, నాలుకపై తెల్లనిపూత రావడం, టాన్సిల్స్ ఎరుపురంగులో పెద్దవిగా కనిపిస్తాయి. ఈ వ్యాధి లక్షణాలు ఉన్న వారు నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు.

సూరారం ఎస్‌హెచ్‌ఓగా వెంకటేశం

గాజులరామారం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): సూరారం పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ వెంకటేశ్వరరావు కూకట్‌పల్లి కేపీహెచ్‌బీకి బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో సీఎస్‌డబ్ల్యూ సైబరాబాద్ నుంచి ఎ.వెంకటేశం బాధ్యతలు చేపట్టనున్నారు. సూరారం పోలీస్‌స్టేషన్ ప్రారంభం నుంచి వెంకటేశ్వరరావు సేవలందించారు.

కేపీహెచ్‌బీ ఇన్‌స్పెక్టర్‌గా వెంకటేశ్వరరావు


వెంకటేశ్వరరావు

హైదర్‌నగర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ ఇన్‌స్పెక్టర్‌గా ఎం.వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వెంకన్న బదిలీపై రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. సూరారం పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న వెంకటేశ్వరరావును కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. అదేవిధంగా ఇక్కడ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న రాజేందర్‌గౌడ్ అల్వాల్ పోలీస్‌స్టేషన్‌కు, టాస్క్‌ఫోర్‌లో ఉన్న బి.మధుసూదన్ కేపీహెచ్‌బీకి డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీఅయ్యారు. ఈ మేరకు సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

డ్రగ్స్‌ఫ్రీ సిటీగా మార్చేందుకు..

విద్యాశాఖతో కలిసి పోలీసుల ప్రణాళిక

హైదరాబాద్ సిటీ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ ఫ్రీ సిటీలో భాగంగా డ్రగ్స్‌కు అడ్డుకట్ట వేసేందుకు విద్యాశాఖతో కలిసి పోలీసు అధికారులు కార్యాచరణ రూపొందించారు. ఇందులో భాగంగా వివిధ స్కూళ్లకు చెందిన విద్యార్థులకు డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించనున్నారు. దీనికి సంబంధించి ఆదివారం కమాండ్ కంట్రోల్ రూములో విద్యాశాఖ సెక్రటరీ బి.వెంకటేశం, కమిషనర్లు కొత్తకోట శ్రీనివాసరెడ్డి, అవినాష్ మహంతి, తరుణ్ జోషి, టీఎస్‌న్యాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, యాంటి నార్కొటిక్స్ ఫోరం జాయింట్ సెక్రటరీ కేజీఎస్ఎస్ శ్రీకాంత్‌తో కలిసి సమావేశం నిర్వహించనున్నారు.